# చట్టసభల్లో మహిళలకు 50 శాతం వాటా సాధిస్తాం




- డీసీసీ అధ్యక్షులు గాజంగి నందయ్య
- 'శక్తి అభియాన్'తో జగిత్యాల డీసీసీ శంఖారావం

**ప్రజానావ, జగిత్యాల:** రాజకీయ రంగంలో మహిళలకు సముచిత స్థానం కల్పించడమే ధ్యేయంగా జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ 'తెలంగాణ శక్తి అభియాన్' ఉద్యమానికి గురువారం శ్రీకారం చుట్టింది. జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య తన కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని గురువారం లాంఛనంగా ప్రారంభించి కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా నందయ్య మాట్లాడుతూ. "మహిళల భాగస్వామ్యం లేని ప్రజాస్వామ్యం అసంపూర్ణమన్నారు. ఇన్నాళ్లూ రాజకీయ పార్టీలు మహిళలను కేవలం ఓటు బ్యాంకుగానే చూశాయని, కానీ కాంగ్రెస్ ఇకపై వారిని నిర్ణయాధికారం కలిగిన నాయకులుగా తీర్చిదిద్దుతుందన్నారు. అందుకే చట్టసభల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్ సాధించడమే 'శక్తి అభియాన్' ప్రధాన లక్ష్యం" అని స్పష్టం చేశారు. ఇది కేవలం నినాదం కాదని, కార్యాచరణతో ముందుకు వెళ్తామని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలోని చైతన్యవంతులైన మహిళలు, యువతులు ఈ చారిత్రక ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. "రాజకీయాల పట్ల ఆసక్తి ఉన్నవారు, సామాజిక మార్పు కోరుకునే ఆడబిడ్డలు ముందుకు రావాలని నందయ్య కోరారు. జగిత్యాల జిల్లాలోని ప్రతి డివిజన్, ప్రతి బస్తీ నుంచి మహిళా గొంతుక వినిపించాలని సూచించారు. రాబోయే రోజుల్లో జగిత్యాల నుంచే మహిళా నాయకత్వానికి దిక్సూచి చూపిస్తాం" అని నందయ్య అన్నారు. 'శక్తి అభియాన్' జిల్లా కో-ఆర్డినేటర్ కృష్ణవేణి, సీనియర్ నేత సి.ఎస్. శివలాల్ నేతికర్ లు పాల్గొన్నారు. నలుగురు నేతలు 'తెలంగాణ శక్తి అభియాన్‌లో చేరండి' అంటూ రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శించి, ఉద్యమ స్ఫూర్తిని చాటారు. ఈ ఉద్యమంలో చేరాలనుకునే మహిళలు, యువతులు కింది నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చనీ కృష్ణవేణి 83677 37373, సి.ఎస్. శివలాల్ నేతికర్ 99664 82554, అలాగే http...www.shaktiabhiyan.in వెబ్.సైట్.లో కూడా నేరుగా నమోదు చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.

# మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజానావ, మంచిర్యాల:** ప్రభుత్వం మహిళలకు కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని అన్ని రంగాలలో రాణించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెర్ప్ సమావేశానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్ భారతి లతో కలిసి హాజరై స్వయం సహాయక సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలను విస్తరించాలని తెలిపారు. పెట్రోల్ బంకులు, డెయిరీలు, సోలార్ పవర్ ప్లాంట్లు, స్టిచింగ్, ప్లంబింగ్ వంటి రంగాల్లో మహిళలు ముందుకు రావాలని తెలిపారు. మహిళల సామర్థ్యాభివృద్ధి కోసం ప్రభుత్వం 100 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని, సహాయక సంఘాల మహిళలు ఇందులో పాల్గొని సర్టిఫికెట్ పొందిన అనంతరం వారి నైపుణ్యాల ఆధారంగా ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని తెలిపారు. మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉన్న రంగాలను గుర్తించి సహాయక సంఘాలు తమ కార్యకలాపాలను విస్తరించాలని సూచించారు. జిల్లా కేంద్రంలో నిర్మించిన మహిళా శక్తి భవన్‌ను శిక్షణ కార్యక్రమాలకు వినియోగించుకోవాలని, ప్యాడీ కమిషన్‌లో సుమారు 65 శాతం స్వయం సహాయక సంఘాలకు చేరిందని తెలిపారు. రైతుల అవసరాలను గుర్తించి, వచ్చే పంట సీజన్‌కు అవసరమైన విత్తనాల ఎంపికలో స్వయం సహాయక సంఘాల సభ్యులు భాగస్వామ్యం కావాలని సూచించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పురోగతిలో ఉందని, జిల్లా సమాఖ్య సభ్యులు ఆర్థికంగా లబ్ధి పొందాలని తెలిపారు. మెషిన్, సెంట్రింగ్, సిమెంట్ ఇటుక యూనిట్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. యూనిట్ల స్థాపనకు ఇందిరా మహిళా శక్తి పథకం, పిఎంఎఫ్ఎం ఈ ద్వారా ఆర్థిక సహాయం, శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు.

# రైతులు యూరియా అధిక వాడకం తగ్గించాలి





### సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్.వి శ్రీధర్

**ప్రజానావ, మిర్యాలగూడ :** రైతులు పంట సాగులో యూరియా వినియోగాన్ని తగ్గించాలని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్.వి శ్రీధర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం, సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమాని నియోజకవర్గ పరిధిలోని దామరచర్ల మండలంలోని కొండ్రపోల్ గ్రామంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్.వి శ్రీధర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. మార్కెట్లో డిమాండ్ లో ఉన్న వరి పంట రకాలు మరియు వ్యవసాయ వర్సిటీ వరి రకాల సాగు గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఉద్యాన శాస్త్రవేత్తలు టి. హిమబిందు రైతులు పంటమార్పిడి ఆవశ్యకత గురించి రైతులకు వివరించారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల గురించి, పంట వైవిధ్యాకరణ మరియు పండ్లు కూరగాయలు సాగు మరియు నీటి ఆదా పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం మిర్యాలగూడ ఉద్యాన అధికారి షేక్. నసీమ మాట్లాడుతూ, ఉద్యాన శాఖ రైతులకు అందిస్తున్న సబ్సిడీలు, పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎన్. బాలకృష్ణల, ఏఈఓ సైదులు, కొండ్రపోల్ సర్పంచ్ శ్రీమతి రాధా రామలింగం, దిలావర్ పూర్ సర్పంచ్ బెజ్జం సైదులు, ఎంపిఓ దామరచర్ల, మిర్యాలగూడ క్లస్టర్ ఎచ్ఓ, ఏఈఓ, సైదులు, మట్టారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, శాస్త్రవేత్తలు హిమబిందు, ఆదర్శ రైతులు కొడాలి ప్రభాకర్, రమణ మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# పనులలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలి

- శంకర్ పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ సాతా ప్రవీణ్ కుమార్..

**ప్రజానావ, శంకర్‌పల్లి,:** మున్సిపల్ పరిధిలో జరుగుతున్న పనులలో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని శంకర్ పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ సాతా ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని ఆదర్శనగర్ ఒకటో వార్డులో జరుగుతున్న అండర్ డ్రైనేజ్ పనులను చైర్పర్సన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంట్రాక్టర్ తన పేరు చిరస్థాయిగా ఉండేలా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రాంతాలలో దశలవారీగా అభివృద్ధి పనులను చేపడతామని తెలిపారు. శంకర్ పల్లి మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో 1 వ వార్డు కౌన్సిలర్ ఎర్రోళ్ల ఆనంద్, మాజీ కౌన్సిలర్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



# ముంబైలో ప్రేమోన్మాది

### పెళ్లికి నిరాకరించారని ప్రియురాలు, ఆమె తల్లి దారుణ హత్య

### విరార్‌లో కత్తితో తెగబడ్డ ప్రియుడు.. అనంతరం ఆత్మహత్యాయత్నం

### నిందితుడు శివం ఉపాధ్యాయ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు

**ప్రజానావ, ముంబై:** ముంబై సమీపంలోని విరార్ ప్రాంతంలో ఒక ఘోర ఘటన వెలుగులోకి వచ్చింది. పెళ్లికి నిరాకరించారనే కోపంతో ఓ యువకుడు తన ప్రియురాలితో పాటు ఆమె తల్లిని కూడా కత్తితో దారుణంగా హత్య చేశాడు. నిందితుడిని శివం ఉపాధ్యాయ్ (27)గా గుర్తించారు. తనను పెళ్లి చేసుకోవాలని ప్రియురాలు నాన్సీ మిశ్రా (24)ను నిందితుడు కోరగా, ఆమె మరియు ఆమె తల్లి సరితా మిశ్రా (48) నిరాకరించడమే ఈ దాడులకు కారణమని తెలుస్తోంది. బుధవారం మధ్యాహ్నం ఈ దారుణం చోటుచేసుకుంది. వివాహం విషయమై జరిగిన వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో, ఆవేశానికి లోనైన శివం కిచెన్ నుంచి కత్తి తీసుకుని వారిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్ర గాయాలపాలైన తల్లి, కుమార్తె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘాతుకానికి పాల్పడిన అనంతరం నిందితుడు కూడా బ్లేడుతో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. చికిత్స నిమిత్తం అతన్ని ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం అతని పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. జంట హత్యలకు పాల్పడిన శివం ఉపాధ్యాయ్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు, ఈ ఘోర ఘటనకు సంబంధించి మరిన్ని వివరాల కోసం దర్యాప్తును ముమ్మరం చేశారు.

## కోసిగిలో పారిశుద్ధ్య పనులు



**ప్రజానావ, కోసిగి:** గ్రామంలోని పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో డ్రైనేజీల శుభ్రత పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీలలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగిస్తూ, డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికను యంత్రాల సహాయంతో శుభ్రం చేస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో దోమలు, దుర్వాసనలు, వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా నీరు నిల్వ ఉండే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, కాలువలను పూర్తిగా శుభ్రం చేయిస్తున్నారు. గ్రామ ప్రజలు కూడా పారిశుద్ధ్యంపై అవగాహన పెంచుకుని చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా సహకరించాలని అధికారులు కోరారు. ఈ చర్యలతో గ్రామంలో ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## 20 ఎకరాల వరిగడ్డి దగ్ధం



**ప్రజానావ, గన్నేరువరం:** గన్నేరువరం మండలంలోని చాకలివానిపల్లి గ్రామ శివారులో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ వైర్లు ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు రాలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో సుమారు 20 ఎకరాలకు సంబంధించిన పశుగ్రాసం (వరిగడ్డి) పూర్తిగా కాలి బూడిదయ్యింది. మంటలు వేగంగా వ్యాపించడంతో పశుగ్రాసంతో పాటు రైతు కూన రాజశేఖర్‌కు చెందిన విలువైన వ్యవసాయ పనిముట్లు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా బాధిత రైతు రాజశేఖర్ మాట్లాడుతూ.. అగ్నిప్రమాదం కారణంగా తాను తీవ్రంగా నష్టపోయానని, ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

## చిన్నారులకు ఆర్థికసాయం



**ప్రజానావ, తిమ్మాపూర్:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీకి చెందిన చిన్న పిల్లలకు ఆర్థిక సహాయం అందించారు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ టీమ్ సభ్యులు. చిన్నారుల తల్లిదండ్రులు రవికుమార్ లలిత దంపతులు తమ కుటుంబ గొడవల కారణంగా చిన్నారులను ఎల్ఎండీ ఠాణా లో వదిలి వెళ్లిన విషయం తెలిసిందే. కాగా మీడియాలో వచ్చిన కథనాలను చూసిన ఎమ్మెల్యే దానం చిన్నారులకు అండగా నిలిచారు. గురువారం కరీంనగర్ వచ్చిన ఆయన టీం సభ్యులు పిల్లలకు లక్ష రూపాయల ఎఫ్ డీ తో పాటు నిత్యవసర సరుకులు వస్తువులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ లో చిన్న పిల్లలను వదిలి వెళ్లిన ఘటన ఎమ్మెల్యే దానం నాగేందర్ మీడియాలో చూసి చలించిపోయాడని తెలిపారు. పిల్లల కుటుంబ పోషణ వారి జీవన విధానం గురించి తెలుసుకొని సహాయం అందించినట్లు చెప్పారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



**ప్రజానావ, వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 29వ తేదీ అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. హైదరాబాద్ నుండి వికారాబాద్ వైపు వస్తున్న ఇన్నోవా కారు (AP 28 = 1000) కేడిఆర్ బార్ సమీపంలో రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. కారులో ఉన్న వారు కొత్తగడిలోని తమ బంధువులను కలిసి టీ తాగేందుకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న కలిముద్దీన్‌కు తల మరియు ఛాతీకి బలమైన గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. కారులో ఉన్న మిగిలిన ముగ్గురు అక్బరుద్దీన్, నూరుద్దీన్, నాసిర్ హుస్సేన్‌లలో ఇద్దరు చికిత్స పొంది ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యారు. నిర్లక్ష్యంగా కారు నడిపి కలిముద్దీన్ మృతికి కారణమైన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వికారాబాద్ టౌన్ సిఐ రఘుకుమార్, మున్సిపల్ కమిషనర్, ఆర్ అండ్ బి ఈఈ మరియు ఏఈలు ప్రమాద స్థలాన్ని సందర్శించారు. అక్కడ మళ్లీ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలపై వారు అధ్యయనం చేస్తున్నారు.

